క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

గట్టు: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు భీమన్‌గౌడ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, ఎంపీపీ విజయ్‌కుమార్‌లు గ్రామానికి వెళ్లి భీమన్‌గౌడ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ధరూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, సర్పంచులు నర్సింహులు, గోవిందు, నాయకులు రామాంజనేయులు, బుడ్డప్ప తదితరులు ఉన్నారు.

రేపు కంటి వెలుగుపై సమావేశం

మల్దకల్: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీన ఎంపీపీ రాజారెడ్డి అధ్యక్షతన కంటి వెలుగుపై సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

మల్దకల్: బాలలను పనిలో పెట్టుకోవద్దని సీసీఎస్ ఎస్‌ఐ రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హోటళ్లు, పెట్రోల్ బంకులు, వెల్డింగ్ షాపులలో పనిచేసే బాల కార్మికులను పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయా షాపుల యజమానులకు బడి ఈడు పిల్లలతో పనులు చేయించుకోవడం చట్టరిత్యా నేరమన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించుకోవడం వల్ల కలిగే అనర్థాలను పిల్లల తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా హోటళ్లు, దుకాణాలలో పనిచేస్తున్న 8 మంది బాల కార్మికులను గద్వాలకు తరలించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగు ఇచ్చారు. కార్యక్రమంలో సీసీఎస్ పోలీసు సిబ్బంది, స్పెషల్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మహిళ మృతి

అయిజ: గుర్తు తెలియని మహిళ (60) మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మృతిచెందింది. ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బస్టాండ్‌లో వృద్ధురాలు కూర్చొని ఉండగా ఆకస్మాత్తుగా కిందపడింది. గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణానికి చెందిన సమీరాబేగం, వరలక్ష్మిలకు సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్, కౌన్సిలర్ నాగిరెడ్డిలు పాల్గొన్నారు.

కుట్టుమిషన్‌పై శిక్షణ



మానవపాడు: మండలంలోని కలుకుంట్ల రైతు వేదికలో మహిళలకు కుట్టుమిషన్‌పై బుధవారం శిక్షణ ఇచ్చారు. మహిళలు స్వయం ఉపాధి కోసం 15 కుట్టు మిషన్‌లను నాబార్డ్ ద్వారా ప్రభుత్వం అందించిందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆత్మలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కోటేశ్వరి, మధునాయుడు, కార్యదర్శి సురేష్ మహ్మద్ బాషా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈని కలిసిన యూనియన్ నాయకులు



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ భాస్కర్‌ను బుధవారం 327 యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఈని సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, అశోక్, రాందాస్, లక్ష్మి, శ్రీయుక్త, కృష్ణ, ఆంజనేయులు ఉన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని అలంకరించారు. బుధవారం స్వామివారికి అభిషేకం, మంగళహారతులు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శివ స్వాములు, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- జూరాల వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా గుంతలు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నెట్టెంపాడు - ద్యాగదొడ్డి గ్రామాల మధ్య..



మన్నాపురం - చింతరేవుల గ్రామాల మధ్య రోడ్డు

ధరూరు: మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయ్యారయ్యాయి. రోడ్లు గుంతలమయంగా దర్శనమివ్వడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లాలంటేనే ఆయా గ్రామస్తులు జంకుతున్నారు. పలుచోట్ల వాహనదారులకు గాయాలైన ఘటనలు ఉన్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధాన రోడ్లలోనూ నడి రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులకు, ప్రయాణికులకు పట్ట పగలే చుక్కలు చూపిస్తున్నాయి. అధికారులకు, పాలకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

గుంతలమయంగా ప్రధాన రోడ్లు

మండలంలో ప్రధాన రోడ్లు అధ్వాన్నంగా తయ్యారయ్యాయి. ధరూరు-గట్టు వెళ్లే మార్గంలో మార్లబీడు వరకు బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులకు పట్ట పగలే చుక్కలు చూపిస్తున్నాయి. సింగిల్ రోడ్డు కావడంతో రాత్రివేళలో పరిస్థితి మరీ దారుణంగా ఉందని వాహనదారులు వాపోయారు. అలాగే మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు మీదుగా మక్తల్, నారాయణపేట, ఆత్మకూరు, దేవరకద్ర, తదితర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు కొనసాగుతాయి. జూరాల ప్రాజెక్టు అవతలి భాగంలోని రేవులపల్లి, నర్సన్‌దొడ్డి చౌరస్తా, చింతరేవుల తదితర గ్రామాల మీదుగా ఉన్న బీటీ రోడ్డు ఎక్కడికక్కడే బీటీ తేలి గుంతలు ఏర్పడి ప్రమాదభరితంగా తయారయ్యాయి. ఒక్కో గుంత వద్ద మోకాలు లోతు వరకు గోతులు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గుంతల కారణంగా కార్లు, వివిధ వాహనాలు దెబ్బతింటున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణాలు కొనసాగించే వాహనదారులు మరింత ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ఈ విషయంలో పీజేపీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జూరాల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో గద్వాల మండలం శెట్టి ఆత్మకూరు నుంచి జూరాల ప్రాజెక్టు వరకు ఉన్న ప్రధాన రోడ్డు నిర్వహణను ఇరిగేషన్ శాఖ అధికారులు చూస్తున్నారు. కాగా ఏళ్ల తరబడిగా రోడ్ల నిర్వహణపై దృష్టి సారించడం లేదనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

అధికారుల వివరణ...

ఈ విషయమై ఆర్‌అండ్ బీ శాఖ జేఈ రాజేశ్వరిని వివరణ కోరగా ఆ రోడ్డు తమ పరిధిలోకి రాదని తెలిపారు. పీజేపీ(ఇరిగేషన్) శాఖ పరిధిలోకి వస్తుందని వివరించారు. ఇదే విషయమై పీజేపీ అధికారులను అడగగా రోడ్డు సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించామని త్వరలో మరమ్మతులు చేస్తామని తెలిపారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

శాంతినగర్: ప్రజా సంక్షామనికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం అన్నారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, కొంకలలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ అబ్రమం ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసిన ఘటన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పాలనను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని కొనియాడారు.

బాధితురాలికి పరామర్శ

రామాపురం గ్రామానికి చెందిన సునీల్ భార్య సునీత అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆమె ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలను తెలుసుకొని ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఎంపీపీ రజిత, కొంకల సర్పంచ్ వరలక్ష్మి, మాజీ ఎంపీపీ నాగేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు రవిరెడ్డి, రఘునందన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు ఆంజనేయులు, తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



గట్టు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి బుధవారం జై నడిగడ్డ యువత సభ్యులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలూరు గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి, తెలంగాణ ఉద్యమ నాయకుడు డాక్టర్ ఆంజనేయగౌడ్‌కు రాష్ట్ర క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖల చైర్మన్‌గా నియమించిన సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. పటాసులు కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే ఉచిత హామీలు



నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గద్దం కృష్ణారెడ్డి

గట్టు: ప్రజల దృష్టి మరల్చేందుకే సీఎం కేసీఆర్ ఉచిత హామీలు ఇస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గద్దం కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పెంచికలపాడు, ఆరగిద్ద గ్రామాల్లో శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో పాటుగా బూత్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో వర్చువల్ సమావేశాన్ని గద్వాలలో నిర్వహిస్తున్నందున బూత్ కమిటీ నుంచి పన్నా ప్రముఖ్ వరకు అందరూ హాజరు కావాలని కోరారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీజేపీ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. సీఎం కేసీఆర్ అమలుకు సాధ్యం కాని హామీలు ఇస్తూ మరోమారు ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, నాయకులు అహ్మద్‌అలీ, మహేష్‌బాబు, వీరేష్‌చారి, జగన్‌మోహన్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, ఊసేన్, బీమన్న, శ్రీరాములుగౌడ్, ఆంజనేయులుగౌడ్, తిమ్మప్ప, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



ఉండవెల్లి: చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని సీఐ సూర్యనాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తించిన, ధూషించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాల్‌రాజు, ఏఎస్‌ఐ అయ్యన్న, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ తరహాలో యాప్ అవసరం

అలంపూర్: రవాణ రంగ సంస్థలో కేరళ తరహాలో యాప్ తీసుకురావాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ్మ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రవాణ రంగ కార్మికుల సంఘర్ష యాత్ర పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా నరసింహ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో రవాణా రంగంలో 20 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. కాని వీరిలో దాదాపు 12 లక్షలకుపైగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఫలితాలు అందడం లేదన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాల్లో కార్మికుడు మృతి చెందితే బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రంలో రవాణా రంగంలో ప్రైవేట్ అగ్రిగేటర్స్ సంస్థల దోపిడీని అరికట్టడానికి సవారీ యాప్ తీసుకొచ్చి 35 నుంచి 8 శాతం మాత్రమే జరిమానాలు విధిస్తున్నారన్నారు. ఈ యాప్ ద్వార వసూలు చేసిన డబ్బులను తిరిగి కార్మికుల ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తరహా యాప్‌ను రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు సుంకన్న, రవి, నాయుడు, నరసింహ్మ, రాముడు, సురేష్, బాష, రవి తదితరులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

అలంపూర్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను జెడ్పీ సీఈఓ బృందం, డీపీఓ, ఎంపీఓలు, ఎంపీడీఓలు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆర్అండ్‌బీ అధికారులు, నియోజకవర్గంలోని ఎంఈఓలు ఎమ్మెల్యేను కలిసారు.

క్రమం తప్పకుండా టీకాలు



మాట్లాడుతున్న మారుతీనందన్

గట్టు: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలని జిల్లా ప్రోగ్రామ్ అధికారి మారుతీనందన్ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఆలూరు, గట్టు, మాచర్ల, బోయల గూడెం సబ్ సెంటర్లను జిల్లా ఎన్‌సీడీ కోఆర్డినేటర్ శ్యాంసుందర్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఆయా సబ్ సెంటర్లలో చిన్నారులకు వేసే టీకాల జాబితాను పరిశీలించారు. ప్రభుత్వం అందించే న్యూట్రిషన్ కిట్ల పంపిణీ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్లు పై బడిన వారందరికి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించి పంపిణీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మక్బూద్, ఆయా సబ్ సెంటర్లకు సంబంధించిన ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మల్దకల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శేఖర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న సైబర్‌నేరాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని, సైబర్ నేరాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇమ్మానియేల్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి



డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

గట్టు: గద్వాల నుంచి ఆరగిద్ద మీదుగా గట్టు వరకు నడుస్తున్న బస్సును ఇటీవల రద్దు చేశారని, ఈ బస్సును పునరుద్దరించాలంటూ పీడీఎస్‌యూ నాయకులు గద్వాల డిపో మేనేజర్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. మల్దకల్ మీదుగా ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి, గట్టు వరకు నడుస్తున్న నైట్‌హాల్ట్ బస్సును ఇటీవలే రద్దు చేశారని, ఈ బస్సును పునరుద్దరించాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. రాత్రి వేళ గద్వాలలో 8:20కు బయలు దేరుతుందని ఈ బస్సు ఎంతో మందికి ఉపయోగకరంగా ఉందని తెలిపారు. మండల కేంద్రం నుంచి తెల్లవారు జామున 4:30 బయలు దేరి, గద్వాలకు 6-00 గంటలకు చేరుకుంటుందని దీంతో హైదరాబాదుకు వెళ్లే రైలు ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి రద్దు చేసిన బస్సును పునరుద్దరించాలని గద్వాల డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా, ఉపాధ్యక్షుడు శివకుమార్, నాయకులు అశోక్, ఈశ్వర్, కర్రెప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కేటీదొడ్డి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మనోరమ అన్నారు. బుధవారం మండలంలోని గంగన్‌పల్లి, శివరంగాపురంలోని సీడీపీ నిధులతో సీసీ రోడ్డు పనులకు ఆమె భూమి చేసి ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు చక్రధర్, ప్రతాప్ రెడ్డి జాకీర్, జానీ, లక్ష్మిరెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ మనోరమ

ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు నిర్వహిద్దాం



టీకా వివరాలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు నిర్వహిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆశ కార్యకర్తలతో కంటి వెలుగు కార్యక్రమంపై సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 18వ తేదీ నుంచి రెండో విడత కంటి వెలుగు చేపడుతుందన్నారు. మున్సిపాలిటీలో వార్డుల వారిగా కంటి లోపాలు ఉన్న వారిని గుర్తించి నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పట్టణంలోని హెల్త్ సబ్ సెంటర్‌లో ఎఫ్ఐపీవీ వ్యాక్సినేషన్‌ను ఆమె ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బాలామృతం, గర్భిణుల వివరాలను తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో చేపట్టనున్న చౌక్ బజార్ నుంచి అంబేద్కర్ కాలనీ, ఆర్యవైశ్య ఆలయం, న్యూ మసీద్ వరకు రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు చిట్టెమ్మ, నాగేశ్వరమ్మ, అంజనమ్మ, విజయమ్మ, జయమ్మ, ప్రమీల, భారతి, పద్మ, శివలింగమ్మ, పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ శ్యామల, అంగన్‌వాడీ టీచర్ ఏమేలమ్మ, భారతి, తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

రాజోళి: ప్రజలకు ఎల్లప్పుడు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని మెడికల్ ఆఫీసర్ మధుబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మూడు ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలకు పలు సూచనలు ఇచ్చారు. గర్భిణులకు, శిశువులకు టీకాలపై అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, మద్దమ్మ, రంజిత్‌కుమార్, హెచ్ఈఓ రామకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ మధుబాబు

ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని నిరసన



ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ నాయకులు

అయిజ: ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని బుధవారం పట్టణంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందికంటి విజయ్‌కుమార్, అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, జిల్లా అధ్యక్షుడు కేశవరావు, ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా మహిళా జోనల్ కన్వీనర్ రాములమ్మ ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా అధ్యక్షుడు కేశవరావు మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్ ట్యాపింగ్ చేయడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు జడ్జితో ఉన్నత స్థాయి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు హనుమన్న, స్వామిదాస్, జయన్న, శశివర్మ, తేజ, బుడ్డన్న, భరత్, సతీష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



నూతన కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు నర్సింహులు

ధరూరు: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని నాగర్‌దొడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో రజకులు వెనుకబడ్డారన్నారు. ఎస్సీ జాబితాలో చేర్చేవరకు రజకులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరేష్, ఉపాధ్యక్షుడిగా సురేష్, గౌరవ అధ్యక్షుడిగా శివన్న, ప్రధాన కార్యదర్శిగా సత్యన్న, కార్యదర్శులుగా సత్యన్న, రంగస్వామి, కార్యవర్గ సభ్యులుగా పాపన్న, నర్సింహులు, ఈరన్న, కిష్టన్న, సవారప్ప, కృష్ణ, తిప్పన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రజకుల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు, ధరూరు ఉప సర్పంచు తిప్పన్న, పేపర్ నర్సింహులు, తనగల శ్రీను, కరెంటు నర్సింహులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు

మానవపాడు: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు అందుతాయని డాక్టర్ తాన్విర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ విష్ణు అయిజ పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ తాన్విర్